క్లుప్తంగా

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

–గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడరూరల్: గుడివాడ నియోజక వర్గ ప్రజలకు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వర రావు(నాని) వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన కోరారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే నాని కోరారు.

కొండలమ్మకు మొక్కుబడుల చెల్లింపు

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

చవితి పందిళ్లు ముస్తాబు

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో గణపతి నవరాత్రుల కార్యక్రమాలకు ఆలయాలు ముస్తాబు చేస్తున్నారు. పందిళ్లు వేసి విద్యుత్ దీపాలు అలంకరిస్తున్నారు. తొమ్మిది రోజులు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజు నాటకాలు, హరికథలు, పాట కచేరి తదితర కార్యక్రమాలతో హడావుడి నెలకొంటుంది. ఈ ఉత్సవాల్లో అన్ని వయస్సుల వాళ్లు ఆనందోత్సాహాలతో పాల్గొంటారు. ఇళ్లకు బంధువులు చేరి, మరింతగా సందడి చేస్తుంటారు.

వావిలాల సేవలు ఘనం

గుడివాడరూరల్: తెలుగు భాషాభివృద్ధికి సేవలందించిన ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం తొలి అధ్యక్షుడు వావిలాల గోపాలకృష్ణయ్య తెలుగు జాతికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళా మందిరంలో తెలుగుభాషా వికాస సమితి ఆధ్వర్యంలో వావిలాల జయంతి కార్యక్రమంలో కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్‌కు వావిలాల గోపాలకృష్ణయ్య స్మారక పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుభాషా వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, సభ్యులు సాంబశివరావు, నారాయణరావు, రూప్‌చంద్ జైన్, పొట్లూరి వీరశేషగిరిరావు, మోకా మాధవరావు, గాదె మోహన్‌బాబులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

పామర్రు: విశ్వకర్మ జయంతి వేడుకలను స్థానిక పుట్లమ్మ సత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో కొడాలి గ్రామస్తులై నిమ్మగడ్డ లోకేశ్వరరావు, నాగ వెంకట కామేశ్వరి దంపతులు పాల్గొని పూజలు చేశారు. విశ్వ బ్రాహ్మణ పురోహితులు నూతలపాటి వెంకట సుబ్బారావు, చోడవరపు సురేష్‌ల ఆధ్వర్యంలో ఆవాహన, మండపారాధన, నవగ్రహ పూజ, అనంతరం విశ్వకర్మ భగవానుడికి విశేషంగా పూజా కార్యక్రమాలను చేశారు. విశ్వకర్మను ఆవాహన చేసి విశేషంగా పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. నూతలపాటి రామ్మోహన్‌రావు, నూతలపాటి త్రివిక్రమరావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.ఆర్.కుమార్, శిల్పులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మార్కెట్ సెంటర్‌లో పత్రి దుకాణాల వద్ద భక్తుల రద్దీ



ట్రాక్టర్‌పై వినాయకుడి విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు

చవితి వేడుకలకు సిద్ధం

వినాయక చవితి సందడి మొదలైంది. గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. విగ్రహాలు, పత్రి కొనుగోళ్లతో మార్కెట్ సెంటర్లన్నీ సందడిగా మారాయి. గ్రామాలు, పట్టణాల కూడళ్లలో గణేష్ మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

–గుడివాడరూరల్



నృత్యాలు చేస్తున్న యువకులు

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, లయన్స్ సభ్యులు

గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ సూచించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడసభ్యులు డీఎస్పీ శ్రీకాంత్‌ను ఘనంగా సత్కరించారు.ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రసాద్, లయన్స్ అధ్యక్షుడు విస్సంశెట్టి కృష్ణకిషోర్, కార్యదర్శి యు.సతీష్, ట్రెజరర్ జి.వేణు, ఎంసీసీ బోస్, లయన్స్ సభ్యులు బొగ్గవరపు తిరుపతయ్య యలవర్తి కృష్ణారావు, అప్పారావు, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జుఝవరం(పామర్రు): జుఝవరం గ్రామంలో పామర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం పామర్రు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ మోహన్‌రావు, శ్రీ కృష్ణ సమితి కన్వీనర్ జొన్నలగడ్డ నాగరాజుల వితరణతో ప్రతిమలను పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. అనంతరం 300 మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేశారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన క్లబ్‌డైరెక్టర్లు జోగి గంటలయ్య, పెరుమాళ్ల రాధాకృష్ణలు పాల్గొన్నారు. పామర్రు మానవత డైరెక్టర్, రోష్ణ ట్రేడర్స్ అధినేత కర్రె శ్రీధర్ శ్రీ సుకన్యదంపతుల వితరణలో మట్టి వినాయక విగ్రహాలను వితరణ చేశారు. మానవత అధ్యక్షుడు ఐవీఎస్ మనోహర్, మానవత జిల్లా కార్యదర్శి శీతాల ప్రసాద్, రీజియన్ చైర్మన్ పీఎం ఎస్‌ప్రసాద్, కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, కన్వీనర్ ఎస్ త్రివిక్రమరావు, కొలా శ్రీనివాస్, సోమవరపురామారావు, అల్లాడ సోమశేఖర్, వైఎస్ ఎస్ ప్రసాద్, డొక్కు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం డాల్ఫిన్ పాలిమర్స్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆదివారం ఆది వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ముందుగా నమోదు చేసుకున్న ఉత్సవ కమిటీలకు పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే డీఎన్నార్ నియోజకవర్గ ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ అయినాల బ్రహ్మాజీ, ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, గుమ్మడి వెంకటేశ్వరరావు, బేతపూడి యేసోబురాజు, చేబోయిన వీర్రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: స్థానిక లయన్స్‌క్లబ్ కార్యాలయం వద్ద వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని విగ్రహాలను ఎస్‌ఐ పి.విశ్వనాథ్ ఆదివారం పంపిణీ చేశారు. వాసవీక్లబ్‌ను ఎస్‌ఐ విశ్వనాథ్ అభినందించారు. 1500 విగ్రహాలను భక్తులకు పంపిణీ చేస్తున్నట్లు వాసవీక్లబ్ గౌరవాధ్యక్షుడు చక్కా ఉదయ భాస్కర్ తెలిపారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు తమ్మన ఉమామహేశ్వరరావు, కార్యదర్శి నంబూరి శివన్నారాయణ, కోశాధికారి నున్న కిరణ్ పాల్గొన్నారు

టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు

- బీసీలను కించపర్చేలా మాట్లాడిన టీడీపీ నేతలపై చర్యలకు వినతి
- పట్టణంలో బీసీ సంఘాల నేతల నిరసన ర్యాలీ



వన్‌టౌన్ ఎస్‌ఐ గౌతమ్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న బీసీ నాయకులు

గుడివాడరూరల్: టీడీపీ నిరసన దీక్షలో బీసీ వర్గానికి చెందిన రజక సామాజిక వర్గాలను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని బీసీ సంఘాల నాయకులు ఆదివారం ఆందోళన చేపట్టారు. బీసీ సంఘ అధ్యక్షుడు దారం నరసింహారావు ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన సెంటర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వన్‌టౌన్ ఎస్‌ఐ గౌతమ్‌కుమార్‌కు టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దారం నరసింహారావు మాట్లాడుతూ బీసీల ఓట్లతో గతంలో నెగ్గిన చంద్రబాబు వారిని విస్మరించడంతో వైఎస్సార్ సీపీకి మద్దతు పలికి టీడీపీకి గుణపాఠం చెప్పారన్నారు. బీసీ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు నాగమల్లేశ్వరరావు, బీసీ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు యశోద యామినిదేవి మాట్లాడుతూ బీసీలపై అవాకులు, చవాకులు పేలితే టీడీపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. పట్టణ రజక సంఘ అధ్యక్షుడు నైనవరపు శేషుబాబు, ఉద్యోగ సంఘాల నాయకులు గుళ్లపల్లి ప్రభాకరరావు, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.







సంక్షిప్త వార్తలు

పర్యావరణాన్ని పరిరక్షించు కోవాలి

పామర్రు: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ వీరబ్రహ్మాచారి అన్నారు. ప్రగతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో కళాశాలలో నమామి సాయి శత రుద్రీయం నిర్వహించారు. అనంతరం రెండు వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న భగవాన్ సత్యసాయి బాబావారి శత జయంతి వేడుకల సందర్భంగా 108 శివ లింగాలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నమామి శత రుద్రీయం ద్వారా నిర్వహించామన్నారు. ప్రగతి విద్యా సంస్థల అధినేత సనకా పూర్ణచంద్రరరావు, సత్యసాయి సంస్థల కృష్ణాజిల్లా అధ్యక్షుడుకొమ రగిరిచంద్రశేఖర్, సత్యసాయి రాష్ట్ర ప్రో గ్రామ్ కో ఆర్డినేటర్ కె.నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ పోటీలకు ఎంపిక

పామర్రు: మండల స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపిక అయ్యారని పామర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఇందిరారాణి తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్–17 బాలుర వాలీబాల్ విభాగంలో రిత్విక్, నిఖిల్, అఖిల్, అచ్చిబాబు ప్రతిభ కనబర్చి నియోజవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్–17 కబడ్డీ విభాగంలో రోహిత్, అండర్–14 బాలుర వాలీబాల్‌లో మదీన్, జాన్‌బాబు, లోకేష్, రోషి వర్ధన్ ఎంపిక అయ్యారని అన్నారు. వీరు ఈనెల 19న జరిగే నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీలు మురళీ, రవికిషోర్‌లను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

విజేతలకు బహుమతులు

గుడ్లవల్లేరు: జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు బహుమతులు సాధించారు. ఏపీ యూత్ సర్వీసెస్ జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌ను శనివారం నిర్వహించారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో తమ పాలిటెక్నిక్ విద్యార్థులు వివిధ అంశాల్లో విజయం సాధించారని ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. జానపద గ్రూప్ నృత్యం, జానపద నృత్యం సోలో, జానపద గ్రూప్ గేయం, జానపద సోలో గేయంవిభాగాల్లో ప్రథమం, జానపద గ్రూప్ నృత్యం, జానపద గేయం సోలో విభాగాల్లో ద్వితీయ బహుమతులు లభించాయన్నారు. దీనితో తమ కాలేజీ విజేతలు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. విజేతలు, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి అభినందించారు.

పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభం

తోట్లవల్లూరు: మండలంలోని బొడ్డపాడులో జాజుల పెద నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీవెంకటేశ్వర పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆదివారం పిరమిడ్ సేవాదళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జక్కా రాఘవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో శాకాహార ర్యాలీని నిర్వహించారు. పిరమిడ్ సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివనాగకృష్ణ, మానస సరోవరం ధ్యాన ఆశ్రమం నిర్వాహకుడు కళ్లం రామిరెడ్డి, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షురాలు రాజకుమారి, పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ మూడే శివశంకరరావు, ప్రతినిధులు గాంధీ, అనిత, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

జూదాలపై సమాచారం ఇవ్వండి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): గ్రామాల్లో జూదాల సమాచారం ఇస్తే వెంటనే అరికడతామని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని వెంట్రప్రగడ వద్ద జూదాలు, చవితి ఉత్సవాలు, సమాజంలో మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పేకాట, కోడిపందేలకు అనుమతి లేదన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. సమాజంలో ఎప్పుడికప్పుడు వస్తున్న టెక్నాజీ మార్పును స్వీకరించి ముందుకు సాగాలన్నారు. పామర్రు, గుడివాడ–1 టౌన్ సీఐలు వెంకట నారాయణ, శ్రీనివాసరావు, పెదపారుపూడి ఎస్ఐ పల్లా నాగకళ్యాణి, సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాలికలకు కళ్లజోళ్లు పంపిణీ



గుడివాడరూరల్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు మండలం అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థినులకు ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షుడు ఎస్పీ రవీంద్ర, జిల్లా 202 గవర్నర్ రామలింగరాజు, వాకర్స్ సభ్యులు కళ్లజోళ్ల పంపిణీ చేశారు. దాతలు పర్వతనేని చంద్రశేఖరరావు, లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, ఆర్జా ప్రసాద్, కొమరవోలు రామకృష్ణ, కోన రామారావు, ధ్యాన్‌చంద్ జైన్‌లను అభినందించారు. శాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాత కోన రామారావు అందజేసిన నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కమిటీ సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, కొనకళ్ల సీతయ్య, పొన్నూరి సత్యనారాయణ, మున్నలూరి రామకృష్ణ, లింగం చిట్టిబాబులు పాల్గొన్నారు.











